క్లుప్తంగా

సేవా కార్యక్రమాలతో ఆత్మవిశ్వాసం పెంపు

కొండవీడు పీఎంశ్రీ యూపీ స్కూల్లో దుస్తులు పంపిణీ



యడ్లపాడు: సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని హెచ్ఎం జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కొండవీడు పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో దుస్తుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చిలకలూరిపేట రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులైన ఐదుగురికి నూతన దుస్తులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా అందించారన్నారు. వీటిని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, వైఎస్ చైర్మన్ షేక్ రసూల్, వై కృష్ణవేణి ద్వారా సదరు విద్యార్థులకు పంపిణీ చేశామని వెల్లడించారు. పాఠశాల విద్యార్థులకు సాయం అందించిన పండరీపురం రోటర్‌క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



నరసరావుపేటటౌన్: పట్టణంలోని పలు హోటళ్లపై కల్తీ ఆహార నియంత్రణ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. వినుకొండ రోడ్డు లోని ఓ హోటళ్లలో తనిఖీలు చేపట్టి, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కొన్ని శాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. టెస్టింగ్ సాల్ట్, నిషేధిత రంగులు కలుపుతున్నారన్నా ఫిర్యాదులపై దాడులు చేసినట్లు పేర్కొన్నారు. సేకరించిన శాంపిళ్లను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బార్ కార్యవర్గానికి సన్మానం



వినుకొండ: బార్ అసోసియేషన్ గతవారం నిర్వహించిన ఎలక్షన్ నందు నూతనంగా ఎన్నికైన వారిని సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, గుమస్తాలు ఘనంగా సన్మానించారు. గెలుపొందిన ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాసరావు, సెక్రెటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ పి.వి. రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ నీలం శేఖర్‌బాబు, కోశాధికారి వరగాని శివ శంకర్‌బాబులను బార్ అసోసియేషన్‌లోని సీనియర్, జూనియర్ న్యాయవాదులు అందరూ కలిసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్ట్ సేవలు విలువైనవి



చిలకలూరిపేట: అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సేవలు విలువైనవని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు రూ. లక్ష విలువైన నిత్యావసర సరుకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ రఫాని మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్యం కోసం పాటుపడే కార్మికుల సంక్షేమానికి అసిస్ట్ సంస్థ తన వంతు సహాయం ఎప్పుడూ అందజేస్తున్నదని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జె.కృష్ణ హరీష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులు విలీనం

శావల్యాపురం: మే 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు శావల్యాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖ బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ బుధవారం తెలిపారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి, సప్తగిరి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేర్లతో వేర్వేరుగా కార్యాకలాపాలు నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేశారన్నారు. ఇకపై మే 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పేరుతో లావాదేవీలు కొనసాగుతాయన్నారు. పనిచేస్తాయన్నారు. ప్రధాన కార్యాలయం అమరావతి ఉంటుందన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ నెహ్రూ ఉన్నారు.

చిట్టడవి కాదిది.. ఆదర్శ పాఠశాల!



పాఠశాల ఆవరణలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు



పాఠశాలలో అల్లుకున్న పొదలు

- ఆటస్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు
- తరచూ అగ్నిప్రమాదాలు
- అయినా సిబ్బందికి నిర్లక్ష్యమే

నూజెండ్ల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. పేరులో ఉన్న ఆదర్శం... నిర్వహణలో లేకపోవటం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛ భారత్ లక్ష్యాలు పాఠశాలలో పాటించక పోవటంతో సుందరంగా కన్పించాల్సిన పాఠశాల ఆటస్థలం అడవిని తలపిస్తోంది. పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి ఉండటంతో విష జంతువులకు నివాసంగా మారింది. అటుగా విద్యార్థులు వెళితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. వేసవిలో చెట్లు ఎండిపోవటం, పైన ఉన్న విద్యుత్ తీగల ఒకదానికొకటి రాసుకుని నిప్పురవ్వల రాలిపడుతుండటంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికి మూడుసార్లు ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అక్కడున్న విద్యార్థులే సకాలంలో స్పందించి మంటలు ఆర్పుతుండటంతో పెనుప్రమాదం తప్పుతోంది. పాఠశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అంతేగాక పాఠశాల ఆవరణ శుభ్రం చేసి ఆటస్థలంగా మారిస్తే అటు విద్యార్థుల క్రీడలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇటు అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉంటాయని అభిప్రాయ పడుతున్నారు.



పిచ్చిమొక్కలు కాలిపోయిన ప్రాంతం

గీతాంజలిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యాజమాన్యం

వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ టి. క్రిష్ణవేణి చిన్నారులకు కోర్స్ కంప్లీట్ చేసిన సందర్భంగా శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎంతో ఇష్టంతో పూర్తి చేసిన కోర్సునకు సంబంధించి వారికి ఇస్తున్న ఈ చిరు సత్కారం వారిలో స్ఫూర్తిని నింపి మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకునేలా ఒక ప్రోత్సాహంగా ఒక అపురూప జ్ఞాపకంగా ఉంటుంది అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సాంప్రదాయ దుస్తులు ధరించి కోర్స్ కంప్లీటెడ్ సర్టిఫికెట్స్ ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ వై.శేషగిరి, కరస్పాండెంట్ వై. లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌కు ఆయుర్వేద రత్న అవార్డు



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు విద్యాసాగర్‌కు ఆయుర్వేదరత్న అవార్డు లభించింది. ఆర్థరైటిస్, గైనిక్ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ, అఖిలభారత పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సాంప్రదాయ ఔషధ, ఆధునిక పరిజ్ఞాన సహజ ఆరోగ్య రక్షణ సమగ్రత సమ్మేళన కార్యక్రమంలో విద్యాసాగర్‌కు ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

నేత్రాదానం అభినందనీయం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన అనమాల తిరుపతయ్య (72) అనారోగ్యంతో బుధ వారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అనుమతితో మృతుడి నేత్రాలను (కార్నియా) పెదకాకాని శంకర కంటి వైద్యశాల నేత్ర నిధికి దానం చేసినట్లు జిల్లా అమ్మ సొసైటీ కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా నేత్రాలు దానం చేయటం వలన చూపు లేని వారికి చూపు వచ్చేలా చేస్తుందన్నారు. నేత్రాదానం వల్ల కంటి చూపు లేని వారికి చూపు వస్తుందన్నారు.అనంతరం శంకర కంటి వైద్య నిపుణుల సారధ్యంలో కార్నియా పొరలను ఆపరేషన్ చేసిన తదుపరి ప్రత్యేకంగా బాక్సులో తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మహాలక్ష్మమ్మ, రాఘవరావు, శ్రీనివాసరావు, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమాతో బాధిత కుటుంబాలకు భరోసా



నరసరావుపేటటౌన్: ఉద్యోగుల జీవిత బీమా రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తపాలా బీమా పాలసీ బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని తపాలా శాఖ డివిజన్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి అన్నారు. బుధవారం హెడ్ పోస్టాఫీస్‌లో బాధిత కుటుంబాలకు తపాలా బీమా పాలసీ చెక్కులను అందజేసి మాట్లాడారు. భారత ప్రభుత్వ ఉద్యోగస్తుల జీవిత బీమా రక్షణ కోసం తపాల జీవిత బీమా 1884వ సంవత్సరంలో ప్రవేశపెట్టిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది ఉద్యోగస్తులకు జీవిత బీమా రక్షణ కల్పిస్తూ ఎన్నో రకాల సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. యాదగిరి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చెత్త సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



శావల్యాపురం: చెత్త సంపద కేంద్రాల నుంచి పంచాయతీలకు ఆదనపు ఆదాయం వచ్చేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక చెత్త సంపద కేంద్రంలో నూజెండ్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, షెడ్యూ మిత్రలకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వానపాముల వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయు విధానం, తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చేయాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ,ఈవో పీఆర్‌డిలు పి.సుగుణ, రబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రకు ఘన నివాళి



నరసరావుపేట ఈస్ట్: కమ్యూనిస్ట్ ఉద్యమకారుడు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర రావు వర్ధంతిని బుధవారం అరండల్‌పేటలోని సీపీఐ కార్యలయంలో నిర్వహించారు. రాజేశ్వర రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించటంతో పాటు కార్మిక కర్షక హక్కుల కోసం పోరాడిన యోధుడు చంద్ర అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ముప్పాళ్ల శివశంకరరావు, షేక్.చినజాన్‌సైదా పాల్గొన్నారు.

నాదెండ్లలో చలివేంద్రం ప్రారంభం



నాదెండ్ల: వేసవి దాహార్తి తీర్చేందుకు మంచినీటి చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఎంపీడీవో స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావుతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. వేసవి ముగిసే వరకూ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి పూర్ణచంద్రరావు, నల్లమోతు నారాయణ, పంచాయతీ సిబ్బంది శివారెడ్డి, ఇశ్రాయేలు ఉన్నారు.

రేపు శాంతియుత ర్యాలీ జయప్రదం చేయండి

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వచ్చే శుక్రవారం 11వ తేదీన ముస్లిం, కుల, ప్రజా సంఘాలతో కలిసి శాంతియుతంగా నిర్వహించే ర్యాలీనీ జయప్రదం చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు షేక్ మౌలాలి, మత పెద్ద హాఫిస్ బాజిత్, మస్తాన్‌వలి, కరీముల్లా బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

22న పోలేరమ్మ తిరునాళ్లు

యడ్లపాడు: మండలంలోని మైదవోలు గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరుణాల మహోత్సవం ఈనెల 22వ తేదీ అంగరంగ వైభవంగా జరగనుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష అలంకారాలతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద పొంగళ్లు, నైవేద్యాల సమర్పణతో పాటు పలు రకాల ప్రసాదాల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తిరుణాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేపట్టామని, అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తున్నామని తిరుణాల నిర్వాహకులు వెల్లడించారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలి



నాదెండ్ల: గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పనిచేయాలని నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు చెప్పారు. నాదెండ్ల ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో బుధవారం యడ్లపాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీపథకం టీఏలు, క్లాప్‌మిత్రలు, గ్రీన్‌గార్డులకు శిక్షణ నిచ్చారు. మార్చి నెలాఖరులో జరగాల్సిన శిక్షణ ఉప ఎన్నిక కారణంగా వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పనిచేసి తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. అనంతరం ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నాదెండ్ల సర్పంచ్ మొగిలి నాగలక్ష్మీ, నాదెండ్ల ఎంపీడీవో స్వరూపరాణి, యడ్లపాడు, నాదెండ్ల ఈవోపీఆర్డీలు షేక్ జాకీర్‌హుస్సేన్, నిర్మలాలక్ష్మీకుమారి కార్యదర్శులు మక్కెన సుబ్బారావు, మారుతిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

నరసరావుపేట టౌన్: మైనర్‌లకు నడపటానికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ హైమారావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనర్ యువకులు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. అదే విధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆటోలను సీజ్ చేస్తామని డ్రైవర్‌లను హెచ్చరించారు. వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణలో తమవంతు సహకరించాలని కోరారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలపై కేసు నమోదు చేసి యజమానుల వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

రొంపిచర్ల : మండలంలో మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి చదువుచూ అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థికి బుధవారం ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో 1వ తర గతి చదువుతున్న పేద విద్యార్థి గర్నెపూడి ప్రేమకుమార్ లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాజ్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్, గుంటూరు వారి తరపున బి.లాల్ అహమ్మద్ రు. 5వేల రూపాయలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.నాగరాజు వెయ్యి రూపాయలు, మదన్ మోహన్ వెయ్యి రూపాయలు అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న పేద విద్యార్థికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన వారిని గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం, ఉపాధ్యాయులు ఎం.వి.నాగయ్య, రామాంజనేయులు, అంతయ్య, అచ్చయ్య, శారదా తదితరులు అభినందించారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



విద్యుత్ ప్రభ పై నుంచి మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: మండలంలోని మురికిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న బోటు వీరాంజనేయ స్వామి తిరునాళ్లను మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాలు, ఇత ర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చా రు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని తిరునాళ్లలో పాల్గొన్నారు. వీరాంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభను సందర్శించారు. భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభ వద్ద సందడి నెలకొంది. యువకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలు, పార్టీ పతకాలు చేతబట్టి సందడి చేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల కిట్స్ పంపిణీ



పరీక్షల కిట్స్ అందజేస్తున్న సభ్యులు

రొంపిచర్ల : మండలంలో నల్లగార్లపాడు, మాచవరం గ్రామాలలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం పరీక్షల కిట్స్ అందజేశారు. గుంటూరు నాజ్ ఫౌండేషన్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు మదన్ మోహన్ సహకారంతో నల్లగార్లపాడు గ్రామంలో గల ఆర్ సీయం ప్రైమరీ స్కూల్, అంబేద్కర్ నగర్ లో గల ఎంపీపీ స్కూల్, మాచవరం గ్రామంలో గల ఎంపీపీ(ఎస్.టి) స్కూల్ లలో 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో చేరబోతూ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు పరీక్షల కిట్స్ పంపిణీ చేశారు. మండలంలో మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మారుతున్న సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను 6వ నుండి 9వ తరగతి వరకు చదువుకునేందుకు తమ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యువతను ప్రోత్సహించాలి

ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ



మాట్లాడుతున్న డాక్టర్ శివనారాయణ

నరసరావుపేట రూరల్: వ్యవసాయ రంగంలో యువతను ప్రోత్సహించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. రావిపాడు ఏరువాక కేంద్రంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. లాం పరిశోధన కేంద్రం అసోసి యేట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్‌డీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా అధిక ఆదాయాన్నిచ్చే పంటల గురించి రైతుల కు తెలియజేయాలన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించి అధిక ఆదాయాన్ని పొందా లని తెలిపారు. డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డీఎం నగేష్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో ఏరువాక కేంద్రంలో జరిగిన ప్రదర్శన క్షేత్రాల ఫలి తాలు, వరి, శగన, కంది పంటలలోని చిరుసంచుల ఫలితాలను వివరించారు. కంది పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను పలువురు శాస్త్రవేత్తలు తెలియజేశారు. కందిపైరును ఆగస్టు, సెప్టెంబర్‌లో 72 అంగులాలు, అక్టోబర్‌లో 42 అంగుళాలు సాలుకు సాలుకు మధ్య దూరం పాటించాలని తెలిపారు. మిరపలో బొబ్బరను తట్టుకునే విధంగా నాటు రకాలు, ప్లాస్టిక్ మల్చింగ్ విధానా లు పాటించాలని సూచించారు. దీని వలన నల్లతామర ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, జిల్లా ఉద్యానవన అధికారి సి.హెచ్.వి. రమణారెడ్డి, జిల్లా సూక్ష్మనీటి పారుదల అధికారి సి.హెచ్.ఆంజనేయులు, నాబార్డ్ జిల్లా అధికారి శరత్, జిల్లా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ కోటిరత్నం, డి.ఆర్.సీ.డీడీఏ శివకుమారి, జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ సంజీవరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.శివారెడ్డి, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ సైదానాయక్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివాదం

- బొందిలిపాలెంలో అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- కక్ష సాధింపు చర్యలేనంటూ పలువురు ఆవేదన



ఆక్రమణలో తొలగింపుపై మాట్లాడుతున్న బాధితులు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో నూతన సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు రూ.8 లక్షల నిధులు మంజూరు కాగా అందులో భాగంగా కాలనీలో ఆక్రమణలు తొలగింపునకు పంచాయతీ అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో నివాస గృహాల వారికి పంచాయతీ అధికారులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. గ్రామానికి చెందిన బోడాల వెంకటేశ్వర్లు, ఇర్ల నాగమణిలు మాట్లాడుతూ నివాస గృహాల హక్కుదారులకు పంచాయతీ అధికారులు ముందుస్తుగా నోటీసులు ఇవ్వకుండానే పొక్లయినర్ ద్వారా తొలగింపు పనులు చేపట్టటం ద్వారా పంచాయతీ అధికారులకు నివాస గృహాలకు చెందిన కుటుంబ సభ్యులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి తీరును ప్రశ్నించటంతో పాటు రాజకీయ కారణాల కక్ష సాధింపు చర్యలకు నేపథ్యంలో ఇలాంటి పనులకు అధికారులు పాల్పడటం హేయమైన చర్య అని మాజీ సర్పంచ్ బోడాల వీరాంజినేయులు మండిపడ్డారు.

పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు మాట్లాడుతూ సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు సంబంధించి మూడు నెలల నుంచి నివాస గృహాల వారందరికీ ఆక్రమణలు తొలగించాలని నోటీసులు అందజేశామన్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సైలు లేళ్ళ లోకేశ్వరరావు, కత్తి స్వర్ణలత మహిళా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు నడుమ పంచాయతీ అధికారుల సమక్షంలో ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం నిర్వహించారు.

ప్రాణం నిలిపిన ఇంజక్షన్



వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్ఎం చందోలు నాగవాణి

వినుకొండ: మండలం పెదకంచర్ల గ్రామ రైస్ మిల్లుకు వడ్లతో విజయవాడ నుంచి ఒక లారీ బుధవారం వచ్చింది. లారీ క్లీనర్ శివయ్యకు ఉదయం 8 గంటల సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గుండెనొప్పితో వచ్చాడు. చెమటలతో తడిచి, పడిపోయిన పరిస్థితిలో ఉన్నారు. ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం చందోలు నాగవాణి, సీహెచ్‌వో ప్రమీల ప్రాథమిక చికిత్స అందించి హుటాహుటిన నాగమణి తన సొంత కారులోనే వినుకొండ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజాక్, సిబ్బంది వెంటనే ఈసీజీ టీసీ రక్తపరీక్షలు బీసీ చెక్ చేసి ప్రభుత్వం అందుబాటులో ఉంచిన రూ.40 వేలు గుండె నొప్పి ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలను కాపాడారు. అనంతరం ఏఎన్ఎం నాగవాణి విషయాన్ని విజయవాడలోని బంధువులకు సమాచారం అందించి మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. ఇటీవల గుండె నొప్పి ఇంజక్షన్ అందుబాటులో ఉంచడం తక్షణమే వైద్యసిబ్బంది వైద్యం అందించడంతో రోగి తరఫు బంధువులు పెంచర్ల గ్రామస్తులు, రైస్ మిల్లు ఓనర్ శ్రీనివాసరావులు వైద్యసిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.